నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నుమాయిష్‌లో బెస్ట్ థీమ్.. ఫస్ట్ ప్రైజ్ కొట్టేసిన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ స్టాల్

హైదరాబాద్, ఏప్రిల్ 8:అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్) లో తెలంగాణ అటవీశాఖ తరపున ఏర్పాటు చేసిన స్టాల్ కు ఫస్ట్ ప్రైజ్ దక్కింది. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలో అటవీశాఖకు తొలి బహుమతి వచ్చింది. తెలంగాణకు హరితహారం ద్వారా అటవీశాఖ ఏడేళ్లుగా అమలు చేస్తున్న పర్యావరణ హిత కార్యక్రమాలను ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ప్రదర్శించింది. పచ్చదనం పెంపు, జంతు సంరక్షణ చర్యల నమూనాలను ఈ ప్రదర్శనలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

ఫారెస్ట్ థీమ్ తో ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారంతో పాటు, పిల్లల కోసం ఏర్పాటు చేసిన మినీ జూ కూడా సందర్శకులను పెద్ద సంఖ్యలో ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగిన ముగింపు కార్యక్రమంలో హోం మంత్రి మహబూబ్ అలీ, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధుల చేతులు మీదుగా అటవీశాఖ అధికారులు బహుమతిని అందుకున్నారు. అటవీశాఖ స్టాల్ ను చక్కగా నిర్వహించి, మొదటి బహుమతి గెల్చుకున్న అధికారులు, సిబ్బందిని పీసీసీఎఫ్ ఉ హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్ అభినందించారు.

హైదరాబాద్ శనివారం 9-4-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:28 సంచిక: 208 పేజీలు:4 వెల: రూ.1/-

మంత్రి కేటీఆర్‌తో మేఘాలయ సీఎం సంగ్మా సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 8: హైదరాబాద్ పర్యటనలో ఉన్న మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా.. శుక్రవారం ఉదయం ప్రగతి భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో సీఎం సంగ్మా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై కేటీఆర్, సంగ్మా చర్చించారు. సంగ్మా దంపతులను కేటీఆర్‌తో పాటు ఆయన సతీమణి శైలిమ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

సీఎస్ సోమేశ్ కుమార్‌ను పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 8: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిత కలిసి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. ఇటీవలే సోమేశ్ కుమార్ తల్లి మీనాక్షి సింగ్ మరణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమేశ్ కుమార్ ఇంటికి వెళ్లి మీనాక్షి సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎస్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

11న టీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ధర్నా: పల్లా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ఈనెల 11న టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ధర్నా చేస్తారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కక్షసాధింపుతో కేంద్రం రైతుల ఉసురు తీస్తోందని దుయ్యబట్టారు. కేంద్రం తెలంగాణ నుంచి ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్రం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి తలా తోక లేదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవాచేశారు.

ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు జాతీయ రహదారుల దిగ్బంధించిన విషయం తెలిసిందే. వరి కంకులు చేతపట్టి రహదారులపై బైఠాయించారు. ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పి, యాసంగి ధాన్యాన్ని కొంటామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో ధాన్యాన్ని కొని, తెలంగాణలో మాత్రం ఎందుకు కొనరని ప్రశ్నించారు. కేంద్రం తెలంగాణపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు

కేసీఆర్‌కు మహిళలంటే గౌరవం: సత్యవతి రాథోడ్

హైదరాబాద్, ఏప్రిల్ 8: గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలపై మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు మహిళలంటే గౌరవమని, మర్యాదగా చూసుకునే సంస్కృతి తమదని తెలిపారు. ప్రోరోగ్ కాలేదు కాబట్టే బడ్జెట్ సమావేశాలు పెట్టుకున్నామని చెప్పారు.

గవర్నర్ ఢిల్లీకి వెళ్లి మాట్లాడిన మాటలను చూస్తుంటే.. గవర్నర్ మనసులో ఏం ఉందో అర్థమవుతోందన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాను కలిసి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని బెదిరించినట్లు మాట్లాడారని తప్పుబట్టారు. గవర్నర్ బీజేపీ కార్యకర్తలా మాట్లాడారని సత్యవతి రాథోడ్ దుయ్యబట్టారు.

చరిత్రలో నేటినిజం



(ఏప్రిల్ 9 ప్రముఖ నలుదు,నిర్మాత ఎం.బాలయ్య జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210

మత్స్యకారుల అభివృద్ధికి భారీగా నిధులు : మంత్రి తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 8 చేప పిల్లల ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం నాంపల్లిలోని హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్ లో మత్స్య శాఖ అధికారుల ఒకరోజు వర్క్ షాప్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా కోట్లాది రూపాయల వ్యయంతో ఉచితంగా చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ చేప పిల్లలను పక్క రాష్ట్రం నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని, కానీ రాష్ట్ర అవసరాలకు సరిపడా చేప పిల్లలను రాష్ట్రంలోనే ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉమ్మడి రాష్ట్రంలో మత్స్య శాఖకు సరైన ఆదరణ, నిధుల కేటాయింపు ఉండేది కాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మత్స్య రంగ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో గల 23 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం 1.30 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు చెప్పారు. 2019-20 సంవత్సరంలో ఈ కేంద్రాల ద్వారా 2.5 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేయగా, 2020-21 సంవత్సరంలో 5 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసినట్లు వివరించారు.

గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఇప్పటి నుండే ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులు కానీ, సంస్థలు కానీ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ముందుకొస్తే ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాళేశ్వరం, కొండపోచమ్మ, మల్లన్న సాగర్ వంటి నూతన ప్రాజెక్ట్ ల నిర్మాణం, మిషన్ కాకతీయ కార్యక్రమంతో చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలతో నీటి వనరులు పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో భారీగా మత్స్య సంపద పెరిగి మత్స్యకారుల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయని చెప్పారు.

సర్కార్ బడుల రూపురేఖలు మార్చేందుకే మన ఊరు-మన బడి : మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 8: : ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చి కార్పోరేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకే మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. జిల్లాలోని ఘట్‌కేసర్ మండల పరిధి ఎదులాబాద్, అంకుషాపూర్ లలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అదనపు గదుల నిర్మాణాలకు మంత్రి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ఆధునీకరణకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

ప్రజలు, పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేసి పాంశాలలను మరింత అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

కేసీఆర్‌ను ఇంటికి పంపడానికి గవర్నర్ ఎవరు? : మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

హైదరాబాద్, ఏప్రిల్ 8: తాను తలచుకుంటే ప్రభుత్వం పడిపోయేది.. బడ్జెట్ సమావేశాలకు అనుమతివ్వకుండా 15 రోజులు పెండింగ్‌లో పెడితే అసెంబ్లీ రద్దయ్యేది అని వ్యాఖ్యానించిన గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ తీవ్రంగా తప్పుబట్టారు.

గవర్నర్ వ్యాఖ్యలను ఖండిస్తూ నాగేశ్వర్ ట్వీట్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నుకున్నారని నాగేశ్వర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపడానికి గవర్నర్ ఎవరు? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఎవరు పాలించాలనేది తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారు.. కేంద్ర ప్రభుత్వం కాదు అని నాగేశ్వర్ గవర్నర్‌కు చురకలంటించారు. ఈ ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేశారు.

కోరుట్లలో ముగ్గురు జనశక్తి మావోయిస్టుల అరెస్ట్

జగిత్యాల, ఏప్రిల్ 8: కోరుట్లలో ముగ్గురు జనశక్తి మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. కోరుట్ల శివారు కోనరావుపేట క్రాస్ రోడ్డు దగ్గర పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ ముగ్గురు అనుమానితులను ప్రశ్నించగా జనశక్తి మావోయిస్టులుగా నిర్ధారణ అయింది. సెంట్రల్ కమిటీ మెంబర్ సురేందర్‌తో పాటు చిట్టీ రాజేశ్వర్, నగునూరి గంగాధర్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు జనశక్తి మావోయిస్టుల నుంచి 4 రివాల్వర్లు, 3 ట్వీలర్ బోర్ తుపాకులు, 1 తపంచ, 299 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సీఎం కేసీఆర్ కలలను నిజం చేయాలి : మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్, ఏప్రిల్ 8: సబ్బండవర్ణాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారు. ఆయన కలలను నిజం చేయడంలో మనమంతా వారధులుగా పని చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్ర గిరిజన సహకార సంస్థ(జీ.సి. సి) చైర్మన్ గా నియామకమైన రమావత్ వాల్యా నాయక్ నేడు దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో గిరిజనుల సమగ్ర వికాసానికి పాల్పడింది ఎవరో ఆలోచించాల్సిన అవసరం గిరిజనలపై ఉందన్నారు. జిసిసి చైర్మన్ గా నేడు బాధ్యతలు స్వీకరించిన వాల్యా నాయక్ జీసిసిని మరింత ముందుకు తీసుకెళ్లాలి. జిసిసి గతంలో లాభదాయకంగా లేదు. జిసిసి ఉద్యోగులుగా పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాల్లో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని, వారిని కూడా అభివృద్ధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారన్నారు.

కార్యక్రమంలోమంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, జి.సి.సి మాజీ చైర్మన్ గాంధీ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు తదితరులు పాల్గొన్నారు.

రామ్‌జెట్ మిస్సైల్ టెక్నాలజీని పరీక్షించిన డీఆర్డీవో

చాందిపూర్, ఏప్రిల్ 8:: సాలిడ్ ఫ్యూయెల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) బూస్టర్ మిస్సైల్ టెక్నాలజీని ఇవాళ డీఆర్డీవో పరీక్షించింది. ట్రయల్ పరీక్ష సక్సెస్ అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో డీఆర్డీవోకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కంగ్రాట్స్ తెలిపారు. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సెంటర్ నుంచి ఎస్ఎఫ్‌డీఆర్ బూస్టర్‌ను పరీక్షించారు. ఇవాళ ఉదయం 10.30 నిమిషాలకు ఈ పరీక్ష జరిగింది. మిస్సైల్ సిస్టమ్‌లో ఉన్న అన్ని పరికరాలు నిర్విఘ్నంగా పనిచేసినట్లు డీఆర్డీవో తెలిపింది. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న మిస్సైళ్లను ఎస్ఎఫ్‌డీఆర్ అడ్డుకోగలదు. సూపర్ సోనిక్ ధ్వని వేగం కన్నా వేగంగా మిస్సైల్‌ను అడ్డుకుంటుంది. టెలిమెట్రీ, రేడార్, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఇచ్చిన డేటా ఆధారంగా ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతమైనట్లు తేల్చారు. హైదరాబాద్‌కు చెందిన డీఆర్డీఎల్, ఆర్‌సీఐ ల్యాబ్, పూణెలోని హెచ్ఈఎంఆర్ఎల్ సంస్థలు ఈ కొత్త టెక్నాలజీని డెవలప్ చేశాయి.

వికలాంగ చిత్రకారుడికి - అభిమానిగా మారిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ఖర్గోన్ జిల్లా ప్రధాన కార్యాలయానికి 80కిలోమీటర్ల దూరంలో ఉన్న బార్వాలో నివసిస్తున్న వికలాంగ చిత్రకారుడు ఆయుష్ ఇటీవల ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీని కలిశారు. ఈ వికలాంగ చిత్రకారుడు ఆయుష్ కుండ్ తన 5 కలలలో ఒకటి తన సొంత ఇల్లు అని చెప్పాడు. దాంతో ముందుగా ఇంటి మ్యాప్ ఇవ్వాలని ఆయుష్‌ను ప్రధాని మోడీ కోరారు. ఆయుష్ తన సొంత పాదాలతో తన కలల ఇంటి మ్యాప్‌ను తయారు చేశాడు. అదే ప్రాంతంలో ఆయుష్ నిర్మించిన ఈ ఇంటి మ్యాప్‌ను చూసేందుకు ఎంపీ జ్ఞానేశ్వర్ పాటిల్, బార్వా ఎమ్మెల్యే సచిన్ బిర్లా ఆయుష్ ఇంటికి చేరుకున్నారు. ఆయుష్‌కు ఎంపీ పూలమాల వేసి స్వాగతం పలికారు. ఆయుష్ తల్లి సరోజ .. సోదరి పరి ఇంటి చిత్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యేతో సహా అక్కడ ఉన్న బీజేపీ కార్యాలయ బేరర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయుష్ తల్లిని తన సొంత ప్లాట్ గురించి అడిగారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్లాట్‌ను కొనుగోలు చేయలేక పోతున్నానని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తర్వాత ఆయుష్ కలల ఇంటికి అన్ని విధాలా సాయం చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయుష్ 5 కలలలో ఒకటి ప్రధానమంత్రిని కలవడం అనేది ఒకటి. ఎంపీ జ్ఞానేశ్వర్ పాటిల్ కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ మార్చి 24, 2022న ఢిల్లీలో ఆయుష్ ప్రధాని మోడీని కలిశారు. తన ట్విట్టర్ ఖాతాను అనుసరిస్తున్న ఫోటోతో ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.నటుడు అమితాబ్ బచ్చన్‌ను కలవాలనే ఆయుష్ కల కూడా నెరవేరింది. ఇప్పుడు కౌన్ బనేగా కరోడ్‌పతితో కంటెస్టెంట్‌గా చేరి సొంత ఇంటి కల ఇంకా మిగిలిపోయింది. ఆయుష్ తీవ్ర అస్వస్థతతో బాధపడుతూ మాట్లాడలేదు.. కాళ్లమీద నిలబడలేదు. అయితే తన పెయింటింగ్స్‌తో భారతదేశ ప్రజల హృదయాలను గెలుచుకోవడమే కాదు, ఇప్పుడు ప్రధాని మోడీ కూడా అతనికి అభిమానిగా మారారు.

ఆయుష్మాన్ భారత్, ఆయుష్మాన్ డిజిటల్ మిషన్ ప్రగతిపై చర్చ..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్.హెచ్.ఎ.) ఆధ్వర్యంలో దక్షిణ ప్రాంతీయ సమీక్షా సమావేశం తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఎ.బి. పి.ఎం.-జె.ఎ.వై.), ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎ.బి.డి.ఎం.) వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు ఎన్.హెచ్.ఎ. బాధ్యత వహిస్తూ వస్తోంది. దక్షిణ ప్రాంతీయ సమీక్షా సమావేశం సందర్భంగా ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఎ.బి. పి.ఎం.-జె.ఎ.వై.) పథకం పరిధిలో, 2022వ సంవత్సరపు ఆరోగ్య ప్రయోజనాల ప్యాకేజీ (హెచ్.బి.పి.) కొత్త రూపాంతరాన్ని ఎన్.హెచ్.ఎ. విడుదల చేసింది. కొత్త రూపాంతరం ద్వారా నూతనంగా 365 తాజా పద్ధతులను అదనంగా జోడించారు. దీనితో ప్యాకేజీల మొత్తం సంఖ్య 1,949కి చేరింది. హెచ్.బి.పి. 2022 ద్వారా ఈ పథకం కింద తొలిసారిగా విభిన్నమైన ధరల వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఆరోగ్య రక్షణ స్థాయి, నగరం స్థాయి ప్రాతిపదికలుగా ఈ ధరల వ్యవస్థను ప్రవేశపెట్టారు.

ఎ.బి. పి.ఎం.-జె.ఎ.వై. పథకం కోసం రోగుల వర్గీకరణకు కొత్త పద్ధతిని కూడా ప్రారంభించినట్టు ఎన్.హెచ్.ఎ. ఈ సందర్భంగా ప్రకటించింది. అంతర్జాతీయ వ్యాధుల వర్గీకరణ (ఐ.సి.డి-11), అంతర్జాతీయ ఆరోగ్యరక్షణ వర్గీకరణ (ఐ.సి.హెచ్.ఐ.) ద్వారా ఈ పద్ధతిని ప్రారంభించారు.సమీక్షా సమావేశం సందర్భంగా ప్రకటించిన చర్యల్లో మరో కీలక అంశం ఏమిటంటే,.. చత్తీస్ గఢ్, హర్యానా, కేరళ, మహారాష్ట్ర, మేఘాలయ వంటి ఐదు రాష్ట్రాల్లో, వ్యాధి నిర్ధారణ సంబంధిత గ్రూపింగ్ వ్యవస్థను (డి.ఆర్.జి.ని) ప్రకటించారు. అంటే, డి.ఆర్.జి. వ్యవస్థ ద్వారా చెల్లింపు జరిపే భారతదేశంలోని మొట్టమొదటి బీమా సంస్థగా ఎ.బి. పి.ఎం.-జె.ఎ.వై. నిలిచింది.

తమిళనాడులోని మహాబలిపురంలో రెండు రోజుల దక్షిణ ప్రాంతీయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 'ఆయుష్మాన్ సంఘం' పేరిట ఈ సమావేశాన్ని 20221, ఏప్రిల్ 7,8 తేదీల్లో జరిపారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రమేయంతో ఈ సమావేశం, ప్రాంతీయ సమీక్షా సమావేశాల్లో 3వది అవుతుంది. అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ ఈ సమీక్షా సమావేశంలో పాలుపంచుకున్నాయి. ఇదివరకు ఉత్తరాది, ఈశాన్య ప్రాంతాల రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఇదే తరహా ప్రాంతీయ సమీక్షా సమావేశాలను ఎన్.హెచ్.ఎ. ఇదే తరహాలో నిర్వహించింది. ఎ.బి. పి.ఎం.-జె.ఎ.వై., ఎ.బి.డి.ఎం. పథకాల అమలులో ప్రమేయం ఉన్న కీలకమైన భాగస్వామ్య వర్గాల మధ్య చర్చలు, సంప్రదింపులకోసం ఈ సమావేశాలను నిర్వహించారు.

తాజాగా జరిగిన దక్షిణ ప్రాంతీయ సమీక్షా సమావేశానికి ఏప్రిల్ 7న తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.ఎ. సుబ్రమణియన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రముఖులను తమిళనాడు ప్రభుత్వం తరఫున సత్కరించారు. ఎన్. హెచ్.ఎ. ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి. ఇ.ఒ.) డాక్టర్ ఆర్.ఎస్. శర్మ సమావేశానికి అధ్యక్షత వహించారు.

లక్షల మంది విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు.. 100 రోజుల కార్యాచరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.74 లక్షల మంది విద్యార్థులకు టాబ్లెట్‌లు, స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దీన్ని 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేర్చాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి సీఎం యోగి ఆదేశాలు జారీ చేశారు. కొవిడ్-19 మహమ్మారి కారణంగా యువత పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేని కారణంగా రెండేళ్లుగా వారి చదవులు దెబ్బతిన్నాయి.

ఈ క్రమంలో యువత చదువులకు ఆటంకం కలగకుండా చూసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యను ప్రారంభించింది. అయితే చాలా మందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలియకపోవడంతో ఆన్లైన్ స్టడీస్ కూడా సరిగా జరగడం లేదు.

కాగా, యూపీలోని బీజేపీ ప్రభుత్వం తన సంకల్ప్ పత్రలో 2 కోట్ల మంది యువతకు ట్యాబ్లెట్‌లు, స్మార్ట్ ఫోన్‌లను అందించి వారిని సాంకేతికంగా డెవలప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం తన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో తొలివిడతగా 9.74 లక్షల టాబ్లెట్‌లు, స్మార్ట్ ఫోన్‌లను అందజేయాలని భావిస్తోంది.

దీనికి సంబంధించిన సన్నాహాలను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. అవసరమైన అన్ని చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని, యువతకు నిర్ణీత గడువులోగా ట్యాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్లు అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుండి ట్యాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్‌ల కోసం అర్హులైన విద్యార్థులను గుర్తించాలని అధికారులను కోరారు.

గాల్లో దీపాలైన విద్య, వైద్యరంగాలు...!

దేశ దశ, దిశలను నిర్ణయించే ప్రమాణాలుగా అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన వైద్య సదుపాయాలు అనబడే రెండు ముఖ్య అంశాలు గుర్తించబడ్డాయి. విద్యావంతులు పెరిగితే పేదరికం, నిరక్షరాస్యత, జనాభా విస్ఫోటనం సహజంగానే అదుపు చేయబడతాయి. విద్య, వైద్య సదుపాయాల కల్పన ప్రభుత్వాల కనీస బాధ్యతలుగా, ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలి. ప్రభుత్వాలు విద్య, వైద్యరంగాలను భారంగా, ఉత్పాదకత లేని రంగాలుగా గుర్తించడం భవిష్యత్తు తరాలకు శాపంగా మారనున్నాయి. కరోనా అలలు పలుచబడటంతో ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో విద్యాలయాలు తెరిచి విద్యా బోధన జరిగేలా చూస్తున్నారు. కరోనాతో సహజీవనం చేస్తూ మానవ జీవనయానం జరగాల్సిందే, తగు జాగ్రత్తలు తీసుకుంటూ తమ తమ పనులు చూసుకోవలసిందే.

ప్రస్తుత దేశ విద్యరంగ పరిస్థితులు:

ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సకల సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు, తమ బాధ్యతలను ప్రైవేటుకు వదిలేయడం ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగిస్తున్నది. 6 నుంచి 14 వయస్సుగల బాలలు అందరికీ ఉచిత, తప్పనిసరి విద్య హక్కును భారత రాజ్యాంగం కల్పించిన విషయాన్ని ప్రభుత్వాలు మరిచి పోవడం విచారకరం. ప్రాథమిక విద్య కల్పనలో 70 శాతం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటు కొంత భారాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు మోస్తున్నాయి. విద్యాలయాలను నెలకొల్పడం ఎంత ముఖ్యమో, జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగగల నాణ్యమైన విద్యను కల్పించడం కూడా అంత కన్న అతి ప్రధానమని గమనించాలి. మన విద్యా విధానంలో థియరిటికల్ నాలెడ్జికి పెద్ద పీట, ప్రయోగాత్మక పరిజ్ఞానానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. పుస్తకంలోని ప్రశ్నలు/జవాబులను బట్టీ పట్టడం, ర్యాంకుల వెంట పాఠశాలలు/తల్లితండ్రులు వెలం వెర్రిగా పడడం, సృజనకు/ఆలోచనా విస్తృతికి/ఊహాశక్తి విస్తరణకు అవకాశం లేక పోవడంతో డిగ్రీల పట్టాలు కాగితాల వరకే పరిమితం అవుతున్నాయి. నైపుణ్య వికాసం సన్నపూస అయ్యింది. చదువంటే మెడిసిన్ లేదా ఇంజనీంగ్ అని భావించడం దురదృష్టకరం. వీటికి సమాధానంగా నూతన విద్యా విధానం-2020 ప్రవేశ పట్టి, శాస్త్రసాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలు, వ్యక్తిత్వ వికాస అంశాలకు పెద్ద పీట వేసి రాబోయే తరాన్ని నైపుణ్యవంతులుగా నిర్మించాలని ఆశిద్దాం.

విద్యా ప్రమాణాల పెంపు:

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో అక్షరాస్యత రేటు 77.2 శాతం ఉండడం, వీరిలో 82.1 శాతం పురుషుల రేటు, 65.5 శాతం మహిళా అక్షరాస్యత రేటు ఉంది. ప్రపంచ అక్షరాస్యత రేటు 86.3 శాతంతో పోల్చితే భారత్ చాలా వెనుకబడి ఉందని అర్థం అవుతున్నది. విద్య ప్రమాణాలను ప్రభావితం చేసే అంశాల్లో మౌళిక వసతులు కలిగిన విద్యాలయాలు, పని దినాలు, సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విద్యా విధానం, క్రీడా వసతులు, సిలబస్ కూర్పు, విద్యార్థి - ఉపాధ్యాయ మరియు బాలల జనాభా - విద్యాలయాల నిష్పత్తులు లాంటివి ముఖ్య భూమికను నిర్వహిస్తాయి. పాఠశాలలో బాలల నమోదు రేటును పెంచడంతో పాటు డ్రాప్ అవుట్‌లను తగ్గించడంలో దృష్టి సారించాలి. భారతీయ పాఠశాల విద్యలో ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి 1 : 32ఉండగా, ఉన్నత విద్యలో 1 : 24గా ఉన్నది. దక్షిణ ఆఫ్రికా దేశాల్లో టీచర్-విద్యార్థి నిష్పత్తి 1 : 80 ఉండగా జార్జియాలో 1 : 6 ఉన్నది. మన దేశంలో 29 శాతం స్కూల్ డ్రాప్‌అవుట్‌లు ఉండడం సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అవరోధంగా నిలుస్తున్నది.

ఉచిత వైద్య సేవలు అందుతున్నాయా ?

కరోనా కల్లోల నేపథ్యంలో ప్రజారోగ్యం గాల్లో దీపమైంది. వైద్యరంగ బలహీనతలను కోవిడ్-19 వైరస్ బట్టబయలు చేసింది. 138 కోట్ల జనాభా కలిగిన స్వతంత్ర భారతంలో ఉచిత వైద్య సదుపాయాల కల్పనలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ముఖ్యంగా బీహార్, యూపీలో పాటు కొండ ప్రాంత ఈశాన్య ప్రాంతాలు, జమ్ము-కాశ్మీర్ లాంటి రాష్ట్రాల్లో వైద్య వసతుల కొరత అధికంగా ఉన్నది. గ్రామీణంలో వైద్య సబ్-సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు లాంటి ప్రభుత్వ వైద్య సౌకర్యాలు కొంతమేరకు దేశ నలుమూలల విస్తరించబడి ఉన్నప్పటికీ అందరికీ ఉచిత వైద్యం అందడం లేదు. అధిక జనాభా, నాటు వైద్యాలు, మూఢ విశ్వాసాలు, నిరక్షరాస్యత, పేదరికం, భౌగోళిక స్వభావాలు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, ఔషధాల కొరత, ప్రైవేట్ ఆసుపత్రుల అనైతిక కదలికలు, అర్హత కలిగిన వైద్యుల కొరత లాంటి అనేక సవాళ్ళ నడుమ అందరికీ ఉచిత వైద్య సేవలు లభించడం ప్రభుత్వాలకు అసాధ్యంగా తోసుతున్నది.

దేశ వైద్యరంగ పరిస్థితులు:

ఐక్యరాజ్యసమితి సిఫార్సుల ప్రకారం ప్రతి 1000 జనాభాకు ఒక డాక్టర్ ఉండాలి (1 : 1000 నిష్పత్తి). తాజా వివరాల ప్రకారం భారత్‌లో అల్లోపతిక్ డాక్టర్ -జనాభా నిష్పత్తి 1 : 1,404 (0.8 : 1000) ఉండడంతో అందరికీ ఉచిత వైద్య అందడం లేదు. ఇండియాలో 12 లక్షల యంబిబియస్ డాక్టర్లు, 8.85 లక్షల ఆక్సిల్లరీ నర్సులు, 21.30 లక్షల రిజిస్టర్డ్ నర్సులు మరియు 56,644 మహిళా హెల్త్ విజిటర్స్ ఉన్నారని అంచనా. డాక్టర్-జనాభా నిష్పత్తిలో బీహార్‌లో 1 : 28,391, యూపీలో 1 : 19,962 నమోదు కావడం వైద్య సేవల కొరతను నిరూపిస్తున్నది. జర్మనీలో 4 : 1000, ఆస్ట్రేలియాలో 3.37 : 1000, అమెరికాలో 2.55 : 1000 డాక్టర్-జనాభా నిష్పత్తి ఉన్నది. ఢిల్లీలో అత్యధిక డాక్టర్లు ప్రజావైద్య సేవలో ఉండగా, గోవాలో అత్యధిక రిజిస్టర్డ్ వైద్యులు ఉన్నారని తేలింది. నీతి ఆయోగ్ వివరాల ప్రకారం ఆరోగ్యకర రాష్ట్రాల జాబితాలో కేరళ, ఆంధ్ర ప్రదేశ్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉండగా, తెలంగాణ మాత్రం 10వ స్థానంలో ఉన్నది. దేశంలోని అల్లోపతి డాక్టర్లలో 52 శాతం ఐదు రాష్ట్రాలలోనే (మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మరియు యూపీ) ఉన్నారు. దేశవ్యాప్తంగా 479 వైద్య కళాశాల ద్వారా ప్రతి ఏటా 67,218 మంది యంబిబియస్ కోర్సులో చేరుతున్నారు. వీరితో పాటుగా ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి) వైద్య విధానాలు కూడా 7.88 లక్షల నిపుణుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాయి. గ్రామీణ భారతంలో ఆర్‌యంపి, పియంపి లాంటి రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కూడా విలువైన వైద్య సేవలు అందిస్తున్నారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తే తరాల మానసిక ఆరోగ్య నిర్మాణాలు తగలబడి పోతాయని, వైద్యం అందని యెడల అనారోగ్య మానవ వనరులు అభివృద్ధిలో భాగస్వామ్యం కాలేరని తెలుసుకోవాలి. విద్య, వైద్యాన్ని ప్రజలకే వదిలి, ప్రభుత్వాలు ఎక్కువ కాలం స్థిరంగా నిలబడలేవు. విద్యావంతులతో దేశ సమగ్రాభివృద్ధి, ఆరోగ్యకర సమాజంతో బహుముఖీన ప్రగతి పరుగులు పెడుతుంది. ప్రభుత్వాలు పౌర సమాజం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, భారతీయులంతా ఆరోగ్యకర విద్యావంతులతో నిండుగా, పసందుగా, భాద్యతాయుతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కార్డ్ లేకుండానే అన్ని ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా: ఆర్బీఐ

ముంబై, ఏప్రిల్ 8:: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ప్రతిపాదన చేసింది. కార్డ్ లేకుండానే అన్ని ఏటీఎంలలో నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నది. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) విధానం ద్వారా ఏటీఎంల్లో నగదు తీసుకునే ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కార్డ్‌లెస్ విత్‌డ్రాలను కొన్ని బ్యాంకులు మాత్రమే కల్పిస్తున్నాయని, అయితే అన్ని బ్యాంకులు, ఏటీఎం నెట్‌వర్క్‌లో కార్డ్‌లెస్ విత్‌డ్రా అవకాశాన్ని కల్పించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు.

2022-23 సంవత్సరానికి సంబంధించిన ద్రవ్య పరపతి విధాన ప్రకటనను ఆయన ప్రకటించారు. కార్డ్ లెస్ విత్‌డ్రా ద్వానా వినియోగదారుడు తన వద్ద బెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేకున్నా ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా కార్డ్ స్కిమ్మింగ్, కార్డ్ క్లోనింగ్ లాంటి చర్యలను కూడా అడ్డుకోవచ్చు అని ఆయన అన్నారు.

క్రెడిట్ లేదా డెబిట్ కార్డుల జారీని ఆపేది లేదని ఆర్బీఐ గరవ్నర్ తెలిపారు. ఆ కార్డులను కేవలం క్యాష్ విత్‌డ్రాల కోసమే కాదు అని, వాటిని రెస్టారెంట్లు, షాపులు, విదేశీ టూర్ల సమయంలో వాడుకునే వీలుందన్నారు. ఆ కార్డులను ఎప్పటికీ కంటిన్యూ చేస్తామన్నారు.

కోవిషీల్డ్ బూస్టర్ డోసు ధర రూ.600- పన్నులు అదనమన్న అదార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ఒమిక్రాన్ కొత్త వేరియంట్ ఎక్స్ఈ కలకలం రేపుతున్నది. దీంతో దేశంలో కరోనా ఫోర్త్ వేవ్‌పై ఆందోళనలు నెలకొన్నాయి.

ఈ నేపథ్యంలో బూస్టర్ డోసుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

18 ఏండ్లు నిండిన వారంతా కరోనా టీకా బూస్టర్ డోసు తీసుకోవచ్చని శుక్రవారం తెలిపింది. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల్లో బూస్టర్ డోసు టీకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

దీంతో కరోనా టీకా బూస్టర్ డోసు కావాలనుకునేవారు డబ్బులు చెల్లించి ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా పొందవచ్చు. బూస్టర్ డోసుకు సంబంధించి కొవిన్‌లో రిజిస్ట్రేషన్ కోసం కూడా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది.

అయితే బూస్టర్ డోసు ధర ఎంత అన్నది స్పష్టం చేయలేదు.

కాగా, కోవిషీల్డ్ టీకాను తయారు చేసిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదార్ పూనావాలా బూస్టర్ డోస్‌పై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. కీలక సమయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. బూస్టర్ డోసుగా కోవిషీల్డ్‌కు అనుమతి లభించిందన్నారు.

బూస్టర్ డోసు ధర రూ.600గా పేర్కొన్నారు.

పన్నులు అదనమని వెల్లడించారు. అయితే ఆసుపత్రులు, పంపిణీ దారులకు బూస్టర్ డోసు కోవిషీల్డ్ టీకాలపై భారీగా డిస్కౌంట్ ఇస్తామని ఆయన తెలిపారు.

మరోవైపు, హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న భారత్ బయోటెక్ దేశీయంగా అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ బూస్టర్ డోసు కూడా కేంద్రం నుంచి ఆమోదం పొందనున్నట్లు తెలుస్తున్నది.

అయితే కొవాగ్జిన్ బూస్టర్ డోసు ధర రూ.900తోపాటు పన్నులు అదనంగా ఉండనున్నాయి.

సాహిత్య అకాడెమి
మరియు
కళల కాణాచి, తెనాలి
సంయుక్తంగా నిర్వహిస్తున్న
తెలుగు నాటకం - సాహిత్యం
(తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా)
ఒకరోజు సదస్సుకు సాహితీప్రియులందరికీ ఆహ్వానం
శనివారం, 16 ఏప్రిల్ 2022
వేదిక : తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం, తెనాలి
కార్యక్రమం
ప్రారంభ సమావేశం : ఉదయం 10 గంటలకు
స్వాగతం : ఎస్.పి. మహాలింగేశ్వర్, ప్రాంతీయ కార్యదర్శి, సాహిత్య అకాడెమి
అధ్యక్షులు : కె. శివారెడ్డి, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడెమి
ముఖ్య అతిథి : ఎల్.బి. శ్రీరామ్, సినీ, నాటకరంగ నటులు; రచయిత
పరిచయం : సాయిమాధవ్ బుర్రా, సినీ రచయిత, వ్యవస్థాపక అధ్యక్షులు, కళల కాణాచి
కీలకోపన్యాసం : అప్పాజోస్యుల సత్యనారాయణ, అజో-విభో ఫౌండేషన్
తేనీటి విరామం
మొదటి సమావేశం : మధ్యాహ్నం 12.00-1.30
అధ్యక్షులు : వాసిరెడ్డి నవీన్
పత్ర సమర్పణ : కె.పి. అశోక్‌కుమార్ / తెలుగు నాటకరంగం - సామాజిక ఉద్యమాలు
కందిమళ్ల సాంబశివరావు / తెలుగు కథ - నాటకరంగం
బిహెచ్. పద్మప్రియ / తెలుగు నవల - నాటకరంగం
భోజన విరామం
రెండవ సమావేశం : మధ్యాహ్నం 2.15-4.00
అధ్యక్షులు : వి.ఆర్. రాసాని
పత్ర సమర్పణ : వాడ్రేవు సుందర్రావు / తెలుగు నాటకరంగం - సామాజిక ప్రాసంగికత
వల్లూరు శివప్రసాద్ / తెలుగు నాటక రచనాశిల్పం
దీర్ఘాశి విజయభాస్కర్ / తెలుగు నాటకం - ప్రయోగాలు
రాజీవ్ వెలిచేటి / తెలుగు నాటకం - ఇతర భాషల సాహిత్య ప్రభావం
తేనీటి విరామం
ముగింపు సమావేశం : సాయంత్రం 4.15-5.00
అధ్యక్షులు : చెరుకుమల్లి సింగ, ఉపాధ్యక్షులు, కళల కాణాచి
ముఖ్య అతిథి : గంగోత్రి సాయి, నాటక ప్రయోక్త, నటులు

ప్రధానమంత్రి ముద్రా యోజన ప్రారంభం నుంచి ఇంత వరకు రూ.18.60 లక్షల కోట్ల విలువైన 34.42 కోట్ల పైగా రుణ ఖాతాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:విలక్షణ మౌలిక లక్షణాలతో ఆర్థిక సమ్మిళితానికి దోహదం చేసిన ప్రధాన మంత్రి ముద్ర యోజన (పి ఎం ఎం వై) ఏడవ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భం లో ఈ పథకం ప్రధాన అంశాలు, దాని విజయాలను చూద్దాం.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2015, ఏప్రిల్ 8వ తేదీన కార్పొరేట్, వ్యవసాయేతర చిన్న/సూక్ష్మ పరిశ్రమలకు రూ. 10 లక్షల వరకు రుణాలు అందించడం కోసం ప్రధాన మంత్రి ముద్ర యోజన (పి ఎం ఎం వై) ను ప్రారంభించారు.

ఈ పథకం 7వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, కేంద్ర ఆర్థిక ఉ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, "ఆదాయ కల్పన కార్యకలాపాల కల్పన కోసం ఈ పథకం కింద రూ.18.60 లక్షల కోట్ల మేర 34.42 కోట్లకు పైగా రుణ ఖాతాలు తెరవడం విశేషం" అన్నారు.

పి ఎమ్ ఎమ్ వై ద్వారా వ్యాపార వాతావరణం , పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడం అనే అంశంపై ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, "ఈ పథకం ముఖ్యంగా చిన్న వ్యాపారాలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంలో సహాయపడింది. ఇంకా అట్టడుగు స్థాయిలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడంలో సహాయపడింది. 68% కంటే ఎక్కువ రుణ ఖాతాలు మహిళలకు మంజూరు అయ్యాయి. 22% రుణాలు ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి ఎటువంటి రుణం పొందని కొత్త పారిశ్రామికవేత్తలకు ఇవ్వబడ్డాయి" అన్నారు.

ముద్రా లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ, ఇతర ఔత్సాహికులు కూడా ముందుకు వచ్చి ఈ పథకాన్ని ఉపయోగించు కోవడం ద్వారా దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోవాలని శ్రీమతి. సీతారామన్ విజ్ఞప్తి చేశారు. "ఇప్పటి వరకు మంజూరు చేసిన మొత్తం రుణాలలో 51% ఎస్ సి/ ఎస్ టి/ ఓ బి సి వర్గానికి అందించడం ద్వారా ప్రధాన మంత్రి ముద్రా యోజన ఆచరణ లో సామాజిక న్యాయం కోసం నిలిచింది. అలాగే ప్రధాన మంత్రి ఆశించిన విధంగా 'సబ్కా సాత్, సబ్కా వికాస్' నిజమైన స్ఫూర్తిని కలిగి ఉంది'' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి (ఎం ఓ ఎస్) డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరాద్ మాట్లాడుతూ, " సూక్ష్మ, చిన్న , మధ్యతరహా పరిశ్రమలకు ఎలాంటి అడ్డంకులు, అవాంతరాలు లేకుండా సంస్థాగత రుణాన్ని అందించడమే ప్రధాన మంత్రి ముద్రా యోజన (పి ఎం ఎం వై) ప్రారంభించడం వెనుక ఉన్న చోదక శక్తి" అని అన్నారు.

"ఈ పథకం ప్రారంభమైన గత ఏడేళ్ల నుంచి 34.42 కోట్ల మంది ఖాతాదారులకు సహాయం అందించడం ద్వారా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విజయవంతంగా చేరువైంది" అని డాక్టర్ భగవత్

'నీతి ఆయోగ్ గుర్తించిన 'ఆకాంక్షాత్మక జిల్లాల' నుండి పెరుగుతున్న లబ్ధిదారులకు ఈ పథకం నిరంతరాయంగా రుణాలను అందించగలిగింది, తద్వారా రుణాలు అందుబాటు.లో లేక ఇబ్బందులు పడే జిల్లాలకు రుణ ప్రవాహాన్ని సులభతరం చేసింది" అని ఆర్థిక శాఖ మంత్రి చెప్పారు.

దేశంలో ఆర్థిక చేర్పు (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) కార్యక్రమం అమలు మూడు స్తంభాలపై ఆధారపడి ఉంది, అవి బ్యాంకింగ్ ది అన్‌బ్యాంక్డ్, సెక్యూరింగ్ ది అన్‌సెక్యూర్డ్ ఫండింగ్ ది అన్‌ఫండ్డ్. ఈ మూడు లక్ష్యాలను కొనసాగుతున్న ముద్ర యోజన పథకం సాంకేతికతను ఉపయోగించుకోవడం బహుళ-స్టేక్‌హోల్డర్ల సహకార విధానాన్ని అవలంబించడం ద్వారా సాధిస్తోంది. అదే సమయంలో ఆర్థిక సేవలకు దూరంగా ఉన్న, వెనుకబడిన వారికి కూడా లబ్ధి చేకూరుస్తోంది.

ఆర్థిక చేర్పు మూడు స్తంభాలలో ఒకటి - అయిన ఫండింగ్ ది అన్ ఫండింగ్- పి ఎం ఎం వై ద్వారా ఎఫ్ ఐ ఎకోసిస్టమ్ లో ప్రతిబింబిస్తుంది, ఇది చిన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణ ప్రాప్యతను అందించే లక్ష్యంతో అమలు జరుగుతోంది.

వివిధ చొరవల ద్వారా వర్ధమాన పారిశ్రామికవేత్తల నుండి కష్టపడి పనిచేసే రైతుల వరకు అన్ని వాటాదారుల ఆర్థిక అవసరాలపై పి ఎం ఎం వై దృష్టి పెట్టింది.

అట్టడుగున ఉన్న ,ఇప్పటివరకు సామాజిక-ఆర్థికంగా నిర్లక్ష్యానికి గురైన తరగతులకు ఆర్థిక సహాయం అందించడంలో ఇది కీలకమైన చొరవ, ప్రధాన మంత్రి ముద్ర యోజన స్వీయ-విలువ ,స్వతంత్ర్య భావనతో పాటు లక్షలాది మంది కలలు ,ఆకాంక్షలకు రెక్కలు ఇచ్చింది.పి ఎం ఎం వై ప్రధాన ఉద్దేశాలు, గడిచిన ఏడు సంవత్సరాల్లో దాని విజయాలను మనం ఇప్పుడు చూద్దాం:

పి ఎం ఎం వై కింద మెంబర్ లెండింగ్ ఇనిస్టిట్యూషన్ లు (ఎం ఎల్ ఐ) - బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్ బిఎఫ్ సి), మైక్రో ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ లు (ఎం ఎఫ్ ఐ), ఇతర ఫైనాన్షియల్ మధ్యవర్తులు అనే రుణగ్రహీతల ఎదుగుదల లేదా అభివృద్ధి , ఫండింగ్ అవసరాలను సూచించే 'శిశు', 'కిశోర్' 'తరుణ్' అనే మూడు కేటగిరీల ద్వారా రూ. 10 లక్షల వరకు రుణాలు అందించబడతాయి.

మెట్రోస్టేషన్‌లో డెలివరీ - మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ



హైదరాబాద్, ఏప్రిల్ 8:దేశ రాజధానిలోని ఆనంద్ విహార్ మెట్రో స్టేషన్‌లో 22 ఏళ్ల నిండు గర్భిణీ , మహిళా సీఐఎస్ఎఫ్ సిబ్బంది.. ఇతర మహిళా ప్రయాణికుల సహాయంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. మూడో నంబర్ ప్లాట్‌ఫారమ్‌లో మెట్రో కోసం వేచి ఉన్న మహిళకు ప్రసవ నొప్పులు వచచాయి. షిఫ్ట్ ఇన్ చార్జి సూచనల మేరకు సీఐఎస్ఎఫ్ గార్డు అనామిక కుమారి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఆమె, ఇతర మహిళా ప్రయాణికుల సహాయంతో, ప్రసవ నొప్పితో బాధపడుతున్న మహిళ ప్లాట్‌ఫారమ్‌లోనే బిడ్డకు జన్మనివ్వడం విశేషం. ఈ మేరకు సిఐఎస్ ఎఫ్ ట్వీట్ చేసింది. సిఐఎస్ ఎఫ్ సిబ్బంది తక్షణ ప్రతిస్పందన ..అవసరమైన సహాయంతో ప్రసవ నొప్పితో బాధపడుతున్న ఒక మహిళకు అత్యవసర ప్రసవానికి సహాయం చేసారు ఏ ఆనంద్ విహార్ మాఖ, మెట్రో స్టేషన్ అని ట్వీట్ లో తెలిపారు. అనంతరం తల్లితో పాటు నవజాత శిశువు ఆసుపత్రికి తరలించామన్నారు. కీలకమైన సమయంలో సత్వరమే స్పందించి అవసరమైన సహాయం అందించినందుకు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి మహిళ .. ఆమె భర్త కృతజ్ఞతలు తెలిపారు.

దళితబంధు లబ్ధిదారులకు డైరీ, కోళ్ల పరిశ్రమ ఏర్పాటుపై అవగాహన

మహబూబాబాద్ , ఏప్రిల్ 8: మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కె.శశాంక ఆదేశాల మేరకు దళిత బంధు లబ్ధిదారులకు గురువారం క్షేత్ర పర్యటన నిర్వహించి డైరీ, కోళ్ల పరిశ్రమ ఏర్పాటుపై పూర్తి అవగాహన కల్పించామని జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్.ఎల్. మనోహర్ శుక్రవారం తెలిపారు.

దళిత బంధు లబ్ధిదారులకు సంబంధిత యూనిట్ ఏర్పాటులో గల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ యూనిట్ విజయవంతంగా నడుపుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావడానికి అవసరమైతే క్షేత్ర పర్యటనలు నిర్వహించి ఇంతకుముందు విజయవంతం సాధించిన వారి యూనిట్ల వద్దకు దళిత బంధు లబ్ధిదారులను తీసుకెళ్లి సంబంధిత యూనిట్ పై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక ఆదేశించారని తెలిపారు.

ఈ సందర్భంగా డోర్నకల్, ఇల్లందు, పాలకుర్తి నియోజకవర్గం దళిత బంధు లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు, పెంపకంలో మెళకువలను తెలుసుకోవడానికి, షెడ్ నిర్మాణం ఎంత పరిమాణంలో ఏర్పాటు చేయాలి, పశువుల దాణా, పోషణ, వాటికి వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, లబ్ధిదారులకు ఉన్న ఇతర అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి బయ్యారం మండలం గంధంపల్లి గ్రామంలో గల పాడి పరిశ్రమ, కురవి మండలం గుండ్రాతిమడుగులో గల కోళ్ల పరిశ్రమలో అనుభవమున్న, అభివృద్ధిలో ఉన్న యూనిట్ దారుల వద్దకు దళిత బంధు లబ్ధిదారులను తీసుకెళ్లి సంబంధిత యూనిట్ల పై పూర్తి అవగాహన కల్పించామని తెలిపారు.

డోర్నకల్ నియోజకవర్గం నుండి 10 మంది, ఇల్లందు నియోజకవర్గం నుండి 6 మంది, పాలకుర్తి నియోజకవర్గం నుండి ముగ్గురు ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొనగా, పాడి పరిశ్రమలో 13 మందికి, కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న 6 గురికి అవగాహన కల్పించామని తెలిపారు.

రష్యాకి భారీ నష్టం - పెద్ద ఎత్తున సైనిక దళాల్ని కోల్పోయాం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:రష్యాకి భారీ నష్టం జరిగిందట. ఉక్రెయిన్ పై దాడులు చేస్తోన్న రష్యా దాడికి వెళ్లిన సైనిక దళాల్ని చాలా వరకు కోల్పోయినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌పై దాడికి దిగి నేటితో 44 రోజులు అవుతోంది. దీనిపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పందించారు. బ్రిటీస్ ఛానల్‌తో ఆయన మాట్లాడుతూ.. భారీ స్థాయిలో దళాల్ని కోల్పోయామని, ఇది విషాదకరమని ఆయన అన్నారు. అయితే త్వరలోనే తమ యుద్ధ లక్ష్యాలను అందుకోనున్నట్లు ఆయన చెప్పారు. కీవ్‌ను టార్గెట్ చేసుకుని ఆక్రమణకు వెళ్లిన రష్యా.. ఇప్పుడు తన ఫోకస్‌ను తూర్పు వైపు నిలిపింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం మండలి నుంచి రష్యాను వెలివేసిన తర్వాత పెస్కోవ్ తాజా అభిప్రాయాలను వెల్లడించారు. బుచ్చా మారణకాండ నేపథ్యంలో మానవ హక్కుల మండలి రష్యాపై ఆ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆ తక్షణమే రష్యా కూడా ఆ మండలికి రాజీనామా చేసింది. సుమారు 1,351 మంది సైనికులు మృతిచెందినట్లు రష్యా మార్చి 25వ తేదీన అంగీకరించింది. మరో వైపు రష్యా 19వేల మంది సైనికుల్ని కోల్పోయినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. కానీ పశ్చిమ దేశాలు మాత్రం మరో సంఖ్యను చెబుతున్నాయి. ప్రస్తుత యుద్ధంలో రష్యా సుమారు ఏడు వేల నుంచి 15 వేల మంది సైనికుల్ని కోల్పోయి ఉంటుందని పశ్చిమ దేశాలు అభిప్రాయపడుతున్నాయి.

18 ఏళ్లు నిండినవారందరికీ బూస్టర్ డోసు.. కానీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:దేశవ్యాప్తంగా 18 ఏళ్ల వయసు నిండినవారందరికీ ఇక నుంచి బూస్టర్ డోసును ఇవ్వనున్నారు. ప్రైవేటు వ్యాక్సినేషన్ సెంటర్లలో ఆ టీకాలు అందుబాటులో ఉంటాయి. ఈనెల 10వ తేదీ నుంచి బూస్టర్ డోసు ఇవ్వనున్నారు. కరోనా వైరస్ నివారణలో భాగంగా కోవిడ్ టీకాలను ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే బూస్టర్ డోసు తీసుకోవాలనుకునే 18 ఏళ్లు దాటినవాళ్లు అమౌంట్ చెల్సించాల్సి ఉంటుంది.

వాస్తవానికి ఆరోగ్య కార్యకర్తలు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది, 60 ఏళ్లు దాటిన వాళ్లకు తొలుత బూస్టర్ డోసు ఇచ్చారు. కానీ 60 ఏండ్లలోపు వాళ్లకు మాత్రం బూస్టర్ డోసును ఉచితంగా ఇవ్వడం లేదు. ప్రభుత్వ వ్యాక్సినేషన్ కేంద్రాల ద్వారా ఫస్ట్, సెకండ

నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

రంగారెడ్డి, ఏప్రిల్ 8:ముంపు సమస్య తలెత్తకుండా వర్షాకాలం రాకముందే నాలా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యూహాత్మక నాలా అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా స్థానికులు ఎదుర్కొన్న ఇబ్బందులను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

దీంతో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 64 కోట్లతో 7 చోట్ల నాలా అభివృద్ధి పనులు, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 23 కోట్లతో రెండు చోట్ల నాలా అభివృద్ధి పనులు, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 10.5 కోట్లతో ఒక చోట నాలా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించి 6 పనులకు గాను టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులను ప్రారంభించారన్నారు. మిగతా పనులకు కూడా వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే వర్షాకాలంలో ముంపు సమస్య ఉండదని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్ఎన్‌డీపీ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ హైదర్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణయ్య, అనురాధ, బాలాపూర్ మండల తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్లు కృష్ణమోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాషను అణచివేస్తే రాష్ట్ర కాంక్ష రగిలింది

హైదరాబాద్, ఏప్రిల్ 8: తెలంగాణ తెలుగు భాష అణచివేతకు గురైన కారణంగానే రాష్ట్ర సాధన ఉద్యమానికి నాంది జరిగిందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. నిజాం కళాశాల తెలుగు శాఖ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ, మూసీ సాహిత్యధారల సంయుక్తాధ్వర్యంలో 'తెలంగాణ భాష-సమాలోచన' అనే అంశంపై గురువారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, తెలంగాణ పదకోశ రచయిత, బహుభాషా వేత్త డాక్టర్ నలిమెల భాస్కర్, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.నారాయణ, ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సదస్సు సంచాలకుడు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, నిజాం కళాశాల తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వేల్పుల కుమారస్వామిలతో కలిసి లింబాద్రి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం, ఆయన మాట్లాడుతూ, రాబోయే విద్యా సంవత్సరం నుంచి మూడేండ్ల తెలుగు కోర్సు ప్రవేశపెడతామని చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ, సంచార వృత్తులకు చెందినవారు తమ జానపద కళలతో తెలుగు భాషను కాపాడుతున్నారని చెప్పారు. 'మన ఊరు ? మన చెట్టు' అనే అంశంపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 5 లక్షల మంది విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారని, ఇది దేశ చరిత్రలోనే ప్రథమమని అన్నారు. సమగ్ర తెలంగాణ నిఘంటువును తీసుకువచ్చేందుకు సకల వృత్తుల వారిని ఏకం చేస్తామని అన్నారు. ఈ సదస్సులో 40 మంది తెలంగాణ భాషపై పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ పత్రాలతో గ్రంథాన్ని ప్రచురించి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ రంజని, డాక్టర్ పగడాల నాగేందర్, డాక్టర్ కసప నరేందర్, డాక్టర్ డి.రాంబాబు, నలిగంటి శరత్ కుమార్, డాక్టర్ డి.ఉదయభాను, డాక్టర్ అట్టెం దత్తయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ హోంగార్డును సత్కరించిన హైకోర్టు చీఫ్ జస్టిస్

హైదరాబాద్, ఏప్రిల్ 8: తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్న ఓ ట్రాఫిక్ హోంగార్డ్‌కు ఊహించని సత్కారం లభించింది. సాక్షాత్తూ తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ తన వాహనాన్ని ఆపి.. ఆ హోంగార్డుకు పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. ఈ ఊహించని సన్మాన కార్యక్రమం అబిడ్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం ఆవిష్కృతమైంది.

చీఫ్ జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ప్రతి రోజు తన అధికారిక నివాసం నుంచి హైకోర్టుకు అబిడ్స్ మీదుగా వెళ్తుంటారు. ఆ సమయంలో అబిడ్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ట్రాఫిక్ హోంగార్డ్ అష్రఫ్ అలీ(5066, అబిడ్స్ పీఎస్) విధులు నిర్వర్తిస్తుంటాడు.

అష్రఫ్ తన విధులను చిత్తశుద్ధితో నిర్వహించడాన్ని చీఫ్ జస్టిస్ ప్రతి రోజు గమనించేవారు. ఈ క్రమంలో అతని పనితీరు పట్ల ఆకర్షితులైన సీజే సతీశ్ చంద్ర శర్మ.. శుక్రవారం ఉదయం తన కాన్వాయ్‌ను బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆపారు. హోంగార్డ్ అష్రఫ్ అలీకి పుష్పగుచ్చం అందించి, అభినందించారు. అష్రఫ్ అలీ పనితీరును మెచ్చుకుంటూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశంసలు కురిపించారు.

అలా మాట్లాడి సహనాన్ని పరీక్షించొద్దు: పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 8: వ్యక్తిగత అజెండాతో జనసేనని స్థాపించలేదని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులు రోడ్డెక్కడానికి, కౌలు రైతుల ఆత్మహత్యలకు..వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలు, పాలసీల గురించి మాట్లాడితే.. తనను వ్యక్తిగతంగా రాక్షసుడు, దుర్మార్గుడు అంటున్నారన్నారు. వైసీపీ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడి తన సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు. అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారని చెప్పారు. పవర్ హాలిడే ప్రకటనతో పారిశ్రామిక అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. 36 లక్షల మంది కార్మికుల ఉపాధికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పీపీఏలు రద్దు చేసిందని పవన్ కల్యాణ్ తెలిపారు.

గవర్నర్ వ్యాఖ్యలను ఖండించిన - మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ , ఏప్రిల్ 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై చేసిన వ్యాఖ్యలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఖండించారు. నేను తలచుకుంటే అసెంబ్లీ రద్దు అయ్యేది అనే విధంగా తన పరిధి దాటి వ్యాఖ్యలు చేశారని, ఉన్నతమైన హోదాలో ఉన్న వ్యక్తులు అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ రాం లాల్ కూలదోసిన తర్వాత ఎలాంటి ప్రజా గ్రాహాన్ని చవిచూశారో మనందరికీ తెలిసిం దేనన్నారు. గతంలో గవర్నర్ గా ఉన్న నరసింహాన్ గౌరవప్రదంగా వ్యవహ రించారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయన్ను అంతే గౌరవించిందని పేర్కొన్నారు. గవర్నర్ తమి ళసై తన గౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రోటోకాల్ పాటించలేదని చెప్పడం అర్థరహితమని, ఎక్కడ ఎవరు ఎలా అవమానించారో చెప్పాలన్నారు. యాదాద్రి పర్యటనకు 20 నిమిషాల ముందే రాజ్ భవన్ నుంచి సమాచారం అందిం దని, అయి నప్ప టికీ యదగిరిగుట్ట చైర్మన్ గవర్నర్ తమి ళసైకి స్వాగతం పలికార న్నారు. గతంలో బీజేపీ తమిళనాడు శాఖ అధ్యక్షురా లుగా పని చేసిన తమిళిసై బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు

ఈఓఎస్-02 ఉపగ్రహాన్ని 2022 రెండవ త్రైమాసికంలో ప్రయోగించనున్నట్లు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:2022 రెండవ త్రైమాసికంలో ఈఓఎస్-02 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని కేంద్ర ఎర్త్ సైన్సెస్ (స్వతంత్ర బాధ్యత), సైన్స్ ఉ టెక్నాలజీ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్, పీఎంఓ, ప్రజాసమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు.

ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధానంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ విషయాన్ని తెలిపారు. వ్యవసాయం, అటవీ, భూగర్భ శాస్త్రం, హైడ్రాలజీ, సూక్ష్మీకరించిన పవర్ ఎలక్ట్రానిక్స్, రియాక్షన్ వీల్స్ మొదలైన అప్లికేషన్‌లతో కూడిన వివిధ కొత్త సాంకేతికతలకు ఈఓఎస్-02 సాంకేతిక ప్రదర్శన ఉపగ్రహం. ఎస్ఎస్ఎల్వి-1 కోసం పేలోడ్‌ను ఏర్పరుస్తుంది..

రాజ్యసభలో ఒక ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధానంలో, డాక్టర్ జితేంద్ర సింగ్ , ఈఓఎస్ -02 వ్యవసాయం, అటవీ, భూగర్భ శాస్త్రం, హైడ్రాలజీ, మినియేటరైజ్డ్ పవర్ ఎలక్ట్రానిక్స్, రియాక్షన్ వీల్స్ మొదలైన అప్లికేషన్‌లతో కూడిన వివిధ కొత్త సాంకేతికతలకు సంబంధించిన సాంకేతిక ప్రదర్శన ఉపగ్రహం. ఎస్ఎస్ఎల్వి-1 కోసం పేలోడ్‌ను రూపొందిస్తోందన్నారు . 2021 త్రైమాసికం-4లో ప్రయోగ తేదీని నిర్ణయించినట్లు ఆయన తెలియజేశారు, అయితే మహమ్మారి ప్రారంభం మరియు తత్ఫలితంగా లాక్ డౌన్ మరియు ప్రపంచ మరియు దేశీయ సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడటం ఆలస్యం కావడానికి కారకాలుగా ఉన్నాయి.

గులాబీ సైనికులకు అండగా తెరాస: పెద్దపల్లి ఎమ్మెల్యే

కరీంనగర్, ఏప్రిల్ 8: గులాబీ సైనికులకు తెరాసా పార్టీ అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం బొంత కుంట పల్లి గ్రామానికి చెందిన టీఆర్ ఎస్ పార్టీ కార్యకర్త లంక కొండయ్య ప్రమాదవశాత్తు మరణించగా టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును వారి భార్య లంక భాగ్యమ్మ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఎంపీపీ బాలాజీ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ ఛైర్మెన్ బుర్ర శ్రీనివాస్,మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత-రమేష్,సూర శ్యామ్,పట్టణాధ్యక్షులు పారుపెల్లి గుణపతి,సర్పంచ్ అనిత ? తిరుపతి,అరుణ్,శీలం శంకర్,పక్కీర్ యాదవ్, తెరాస ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డలతో ఆడుకుంటున్న సీఎం కేసీఆర్ : జితేందర్ రెడ్డి

మెదక్, ఏప్రిల్ 8:రైతు లేకపోతే ప్రపంచమే లేదు.. రైతు బిడ్డలతో సీఎం కేసీఆర్ ఆడుకుంటున్నాడని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. యాసంగి వడ్లను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మెదక్ లో బీజేపీ రైతు అవగాహన సదస్సు నిర్వహించింది. సదస్సుకు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నందీశ్వర్ గౌడ్, బాబు మోహన్, వాసురెడ్డి, విజయ పాల్ రెడ్డి, రాష్ట్ర నేతలు, జిల్లా ఇంచార్జీలు, ఉమ్మడి జిల్లా బీజేపీ నేతలు, రైతులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ? సీఎం కేసీఆర్ కు నేను, నా కుటుంబం అనే అహం పెరిగిందన్నారు. రైతు బాధ్యత వడ్లు పండించడం.. కొనడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అన్నారు. నేను వడ్లు కొనను అని సీఎం కేసీఆర్ అంటున్నాడన్నారు. వడ్లు కొని కేంద్రానికి బియ్యం ఇస్తా అని రాసిచ్చి వచ్చాడు సీఎం కేసీఆర్ అని, ఏ రాష్ట్రం ఎంత బియ్యం ఇస్తారో అగ్రిమెంట్ చేశారన్నారు. గత వానాకాలంలో పండించిన ధాన్యంతో ఎఫ్సిఐకి ఎన్ని బియ్యం ఇచ్చారో స్పష్టం చేయాలన్నారు. హుజురాబాద్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చూసి కేసీఆర్ మైండ్ బ్లాక్ అయిందన్నారు. హుజురాబాద్ లోనే రైతులు, మహిళలపై కక్ష కట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ జితేందర్ రెడ్డి ఎక్కడ కాలు పెడితే అక్కడ బీజేపీ విజయం పక్కా అన్నారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడ జితేందర్ రెడ్డి ఉండాల్సిందేనన్నారు. టీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతుందన్నారు. మాజీ మంత్రి బాబు మోహన్ మాట్లాడుతూ? ప్రతి గింజ కొంటామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పారని.. నేడు విస్మరిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. అబద్ధాల కోరు సీఎం కేసీఆర్ మాటలు వినొద్దని అన్నారు

ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా రెండు రోజుల వైజ్ఞానిక సదస్సును నిర్వహించనున్న ఆయుష్ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో 9 ఉ10 ఏప్రిల్ 2022న భారతరత్న సి. సుబ్రమణియం ఆడిటోరియంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మూడు అత్యున్నత సంస్థలైన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి, నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి రెండు రోజుల సైంటిఫిక్ కన్వెన్షన్ (వైజ్ఞానిక సదస్సు)ను నిర్వహిస్తున్నాయి. హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ శామ్యూల్ హానెమన్ 267వ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. పీపుల్స్ ఛాయిస్ ఫర్ వెల్‌నెస్ (ఆరోగ్యం కోసం ప్రజల ఎంపిక) అన్నది ఈ వైజ్ఞానిక సదస్సు ఇతివృత్తం.

వైజ్ఞానిక సదస్సు మొదటి రోజు, 9 ఏప్రిల్ 2022న కార్యక్రమాలను కేంద్ర ఆయుష్, రేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి ఎస్‌హెచ్. సర్బానందం సోనోవాల్, ఆయుష్ శాఖ సహాయ మంత్రి, డబ్ల్యుసిడి అయిన డాక్టర్ మహేంద్ర భాయి ముంజ్ పారాతో కలిసి ప్రారంభిస్తారు

.ఈ సదస్సుకు హాజరయ్యే డెలిగేట్లలో హోమియోపతి పరిశోధకులు, బహుశాస్త్రాంతర శాస్త్రవేత్తలు, ప్రాక్టీసు చేస్తున్నవారు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలతో పాటుగా వివిధ హోమియోపతి అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొననున్నారు.

ఇప్పటివరకూ, సాగించిన ప్రయాణం, హోమియోపతి రంగంలో సాధించిన విజయాలను సమీక్షించడమే కాక హోమియోపతి అభివృద్ధికి భవిష్యత్ వ్యూహాలను రూపొందించడానికి ఈ సదస్సు అవకాశం ఇస్తుంది. వైద్య పరిశోధనకు సంబంధించిన సమాచారంలో ప్రమాణాలను పాటించడం, వైద్య పరిశోధనలో డాటా ప్రమాణాలు, విధానపరమైన అంశాలు, విద్యా ప్రమాణాలు, బోధనాపరమైన వనరులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు హోమియోపతిలో ప్రధాన భాగస్వాముల మధ్య చర్చను ప్రారంభించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సాంకేతికతలో వేగవంతమైన ఆవిష్కరణలు జరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంరక్షణ నిర్వహణ నమూనా మారుతున్న క్రమంలో వైద్య సంరక్షణను అందచేత, పరిశోధనను రెండింటినీ విలీనం చేయడం ద్వారా దీనిని సాధించవచ్చు. సమగ్ర సంరక్షణలో హోమియోపతిని సమర్థవంతంగా, ప్రభావవంతంగా కలుపుకుపోవడానికి కార్యచరణాత్మక వ్యూహాలను గుర్తించి, ప్రతిపాదించడం అనివార్యం.

ఈ వైజ్ఞానిక సదస్సులో జరుగనున్న చర్చలు హోమియోపతికి ప్రజల ఆమోదాన్ని పెంపొందించం, ప్రజల సంక్షేమం కోసం మొదటి ఎంపికగా హోమియోపతిని అభివృద్ధి చేయడం కోసం భవిష్యత్ రోడ్‌మ్యాప్ కు అంతర్‌దృష్టిని అందించడం లక్ష్యంగా జరుగుతాయి.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు : ఏపీ సీఎం జగన్

అమరావతి, ఏప్రిల్ 8: రాష్ట్రంలో విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణ కారణంగా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఇవాళ ఏపీలోని నంద్యాల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గడిచిన మూడు సంవత్సరాల్లో అనేక సంస్కరణలు చేపట్టామని చెప్పారు. పేదరికం వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కావొద్దన్న ఉద్దేశ్యంతో జగనన్న వసతి దీవెనను ప్రారంభించామన్నా రు. పేదలకయ్యే ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిగా అందజేసి తల్లిదండ్రులను ఆదుకుంటున్నామన్నారు.

కుటుంబంలోని ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ వసతి దీవెనను అందజేస్తామన్నారు. తల్లుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు వేయడం వల్ల కళాశాలల్లో సౌకర్యాలు మెరుగవుతాయని తెలిపారు. కళాశాలల్లో సౌకర్యాలు కల్పించకపోతే కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంగా మార్చే కార్యక్రమం జరుగుతుందని జగన్ తెలిపారు. కొత్తగా 16 మెడికల్ కళాశాలలు రానున్నాయని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటు చేశామని వివరించారు. విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుల కారణంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 8.64శాతం పెరిగిందన్నారు.

ప్రభుత్వం అనేక మంచి కార్యక్రమాలు చేపడుతుంటే చంద్రబాబుకు, ఎల్లో మీడియాకు అసూయ కలుగుతుందని ఆరోపించారు . అసూయను తగ్గించుకోకపోతే బీపీ, గుండెపోటు వచ్చి టికెట్ తీసుకుంటారని వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. రెండో విడత జగనన్న వసతి దీవెన కింద 10లక్షల 68 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 1,024 కోట్లను వైఎస్ జగన్ జమ చేశారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ పథకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8:ప్రజా సంక్షేమ పథకాలలో దేశానికే తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్ మక్తాలో అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ వసం సంగీత యాదవ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆడపిల్లల పెండ్లి కోసం ప్రభుత్వం ఈ బృహత్తరమైన పథకాన్ని తీసుకొచ్చిందని, పెండ్లీడుకు వచ్చిన ప్రతి అమ్మాయికి రూ. 1,00,116 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం కుటుంబ పెద్దగా అందజేస్తుందన్నారు.

వీటితో పాటు ఆసరా పింఛన్లు, రైతు, దళిత బంధు, బీమా లాంటి పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. టీఆర్ఎస్ నాయకులు వసం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్‌కె అహ్మద్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ, నాయకులు రామ్మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కేర్ హాస్పిటల్ వైద్య బృందం

హైదరాబాద్, ఏప్రిల్ 8: రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ లో భాగంగా 'వరల్డ్ హెల్త్ డే' పురస్కరించుకుని బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్ ప్రాంగణంలో వైద్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డా.మంజుల, డా.పవన్ కుమార్ రెడ్డి, డా.సంగీత మాట్లాడుతూ.. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మొక్కలు నాటడం ఆనందంగా ఉందని అన్నారు.

చెట్లను మనం కాపాడితే అవి తిరిగి మనల్ని కాపాడుతాయని పేర్కొన్నారు. మనకు ఆక్సిజన్ ఎంతో అవసరం అన్నారు. ఆక్సిజన్ కావాలంటే ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. అనంతరం కేర్ హైటెక్ సిటీ, కేర్ నాంపల్లి, కేర్ ముషీరాబాద్ వైద్య సిబ్బందికి చాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో కేర్ హాస్పిటల్ వైద్యులు డా.రతన్ జా, డా.రాహుల్ అగర్వాల్, డా.అబ్దుల్, డా.వేణుగోపాల్, ఎస్.కె బేహారా, డా.స్నేహ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైట్ ఫుడ్ కోర్ట్ పునః ప్రారంభించాలి : బొండా

అమరావతి, ఏప్రిల్ 8:ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం, బందర్ రోడ్డు నైట్ ఫుడ్ కోర్ట్ ని తిరిగి ప్రారంభించాలని, ఈ ఫుడ్ కోర్టులో 2014 నుంచి వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారస్తులు 88మందికి న్యాయం చేస్తూ వారికి గతంలో ఏ విధంగా అయితే వ్యాపారం చేసుకోడానికి అనుమతి ఇచ్చారో ఆ విధంగా వారందరికీ తిరిగి ఇవ్వాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ తక్షణమే దాన్ని పరిశీలించి ప్రారంభించే చర్యలు చేపట్టడంతో పాటు అక్కడ వ్యాపారం చేస్తున్నవారందరికీ కూడా న్యాయం చేస్తామని బొండా ఉమకు హామీ ఇవ్వడం జరిగింది.. ఈ హామీతో ఈనెల 10వ తేదీ ఆదివారం రాత్రి వ్యాపారులకు అండగా నిలిచి అక్కడ బండ్లు ఏర్పాటు చేస్తామన్న బొండా ఉమ మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన హామీతో ఈ పోరాటాన్ని వాయిదా వెయ్యడం జరిగింది..

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ? ఈ నైట్ ఫుడ్ కోర్టులో వ్యాపారం చేస్తున్న వ్యాపారులపైన ఎవరైనా దందాలు చేస్తే సహించేది లేదని వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆనాడు టీడీపీ హయాంలో తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో 2014 డిసెంబర్ 23వ తేదిన విజయవాడ నగరపాలక సంస్థ వారు, పోలిస్ శాఖ వారు సంయుక్తంగా బందరురోడ్డు, ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం ప్రక్కన నగర ప్రజలకు రాత్రి సమయంలో ఒకే చోట ఆహారాన్ని అందించేందుకు, చిరు వ్యాపారులతో నైట్ ఫుడ్ కోర్టును ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా, నియమ నిభంధనల ప్రకారం 2020 మార్చ్ 21వ తేది వరకు కొనసాగిందన్నారు.

సాహిత్యం సంగీతం

ఆహ్వానం

శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ కవి
శ్రీ మాయకుంట్ల నారాయణరెడ్డి
రచించిన



నగ్నధ్వని (అశ్వాలు)
గ్రంథావిష్కరణ మహోత్సవము

తేది : 09-04-2022 శనివారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ, కళాసుబ్బారావు కళావేదిక, హైదరాబాద్

ముఖ్య అతిథి : ఆచార్య కొలకలూరి ఇనాక్
పద్మశ్రీ అవార్డు గ్రహీత, పూర్వ ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం

సభాధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
అదనపు జిల్లా కలెక్టర్, మేడ్చల్

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దనమూర్తి,
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

గౌరవ అతిథి : శ్రీ రమణ వెలమకన్ని, ప్రముఖ కవి, విశ్లేషకులు

ఆత్మీయ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం దినపత్రిక

ప్రత్యేక అతిథులు : డా॥ నోరి రాజేశ్వరరావు, ప

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బైక్ ర్యాలీ

సంగారెడ్డి, ఏప్రిల్, 8 (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాలలో శుక్రవారంనాడు తెరాస పార్టీ పిలుపు మేరకు ఇళ్లపై నల్ల జెండాలు ప్రదర్శించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జిల్లా తెరాస పార్టీ అధ్యక్షులు చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర తెరాస పార్టీ పిలుపుమేరకు నల్లజెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోతిరెడ్డిపల్లి పి ఎస్ ఆర్ గార్డెన్ నుండి పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్ మీదుగా సంగారెడ్డి పాత బస్టాండ్ వరకు బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు చింత ప్రభాకర్ తో, తెరాస పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో భారీగా పాల్గొన్నారు. న్యూ బస్టాండ్ కూడలిలో తెరాస జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ సమక్షంలో ఆ పార్టీ శ్రేణులు కేంద్రం రైతులు పండించిన యాసంగి వరి ధాన్యాన్ని కొనుగొలు చేయనందుకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా కొనవలసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని ఇలాగే కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఆయన విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించి సామాన్యుడి నెత్తిపై ఉన్న భారాన్ని తగ్గించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందుల విజయలక్ష్మి, బొంగుల రవి, బుచ్చిరెడ్డి, నాయకులు విజేందర్రెడ్డి, డి సి డి సి చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ వైర్మన్ ప్రభు గౌడ్, తెరాస నాయకులు రషీద్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నర్సింలు, ప్రవీణ్, కౌన్సిలర్లు, తెరాస యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 11న జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు

మెదక్, ఏప్రిల్ 8, (నేటి నిజం ప్రతినిధి): మహాత్మా జ్యోతిబా పూలే 196 వ జయంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. హరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలే జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఇట్టి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించుటకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పమాలాంకరణ అనంతరం సమావేశం నిర్వహింపబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమానికి అందరు ఆహ్వానితులేనని, కావున జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు, అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా ఆయన కోరారు.

11న జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా బహిరంగ సభ -జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంగారెడ్డి, ఏప్రిల్ 08 (నేటి నిజం ప్రతినిధి): ఈ నెల 11న మహాత్మ జ్యోతిరావ్ పూలే 196 వ జయంతోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11 న(సోమవారం) ఉదయం 9 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బి ఆఫీస్ పక్కన గల మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలంకరణ గావిస్తారని తెలిపారు. అనంతరం నటరాజ్ థియేటర్ పక్కన కల్యకుంట రోడ్ లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీ మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతి ఉత్సవానికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై జయంతోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

షెడ్యూల్ కులాల నిరుద్యోగులకు గ్రూప్ 1, గ్రూప్ 2 ఫౌండేషన్ కోర్స్‌కు ఉచిత కోచింగ్

సంగారెడ్డి, ఏప్రిల్ 8 (నేటి నిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయనున్న వివిధ ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతకు ఫ్రీ ఎగ్జామినేషన్ నాన్ రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు వందమంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ గ్రూప్ వన్ మరియు గ్రూప్ 2 ఫౌండేషన్ కోర్స్ నకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక గ్రాడ్యుయేట్ డిగ్రీలో మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. జిల్లాలోని ఎస్సీ యువత నుండి ఆన్లైన్ ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎwww.tsstudycircle.co.in వెబ్సైట్లో ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 8328508067 లో సంప్రదించాలని సూచించారు.

6 ఇన్ 1 టీకాలు- శిశువులకు, తల్లితండ్రులకు ఒక పెద్ద వరం: డాక్టర్ ఎస్. సతీష్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 8: పిల్లలు అసంఖ్యాకమైన క్రిములకు ఉంటారు, వీటిలో కొన్ని తీవ్రమైన వ్యాధులకు దారితీస్తాయి.

ఒక బిడ్డలో రోగ నిరోధక వ్యవస్థ ఇంకా అభివృద్ధి చెందుతూ ఉంటుంది, ప్రాణాంతకమైన అన్ని వ్యాధులతో అది పోరాడలేదు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, అన్ని వయసుల వారిలో డిఫ్తీరియా, పెర్టుసిస్ (కోరింత దగ్గు), మరియు ధనుర్వాతం లాంటి ఇన్ఫెక్షన్ల వల్ల సంభవించే మరణాల్ని నిరోధించడానికి అత్యంత విజయవంతమైన ప్రజా ఆరోగ్య ఆవిష్కరణల్లో ఇమ్యూనైజేషన్ ఒకటి. 6 ఇన్ 1 సమ్మేళన టీకా పిల్లల్ని ఆరు తీవ్రమైన వ్యాధుల నించి కాపాడుతుంది: డిఫ్తీరియా, పెర్టుసిస్, ధనుర్వాతం, హేమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా టైప్ బి, హెపటైటిస్ బి మరియు పోలియోమైలిటిస్.

ఈ విషయంపై, డాక్టర్ సతీష్ కుమార్, ఎండి పిడియాట్రిక్స్, ఎన్ఎన్ఎఫ్ ఫెలో, సతీష్ పిల్లల ఆసుపత్రి, నయీం నగర్, హనుమకొండ, మాట్లాడుతూ "తీవ్రమైన వ్యాధుల నించి రక్షణ అనేది బాల్యంలో పిల్లల టీకాల ద్వారా మొదలవుతుంది. పిల్లల్లో రోగ నిరోధకత పెరగడానికి అవసరమైనవి కనీసం లిలీ ఉన్నాయి.

వీటిని చాలా వరకూ ఇంజక్షన్లుగా ఇస్తూ ఉంటారు. బిడ్డకు నొప్పి, బాధ కలుగుతుందని తల్లితండ్రులు ఆందోళన పడుతూ ఉంటారు,

అందుకనే 6 ఇన్ 1 వ్యాక్సినేషన్ వారికీ, వారి పిల్లలకూ, బాధకు కారణమైన వైద్యులుగా మాకూ జీవితాల్ని సులభతరం చేస్తుంది! కొద్ది మోతాదులు, పూర్తి రక్షణ అనేది నిజానికి మనందరికీ ఒక వరం. పిల్లల్లో రోగనిరోధకత నిర్మాణం పుట్టుకతోనే మొదలవుతుంది. సరైన వ్యాక్సినేషన్లను, నిర్ణీత వ్యవధుల ప్రకారం అందించినట్లయితే, తీవ్రమైన మరియు ప్రాణాంతకమైన అనారోగ్యాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక రోగనిరోధకత పిల్లల్లో పెరగడానికి అది సాయపడుతుంది.

ప్లాస్టిక్ రంగంలో నిరుద్యోగ యువతకు అపార ఉపాధి అవకాశాలు- డా॥బి.శ్రీనివాసులు, సీపెట్ ప్రిన్సిపాల్ డైరెక్టర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:నిత్యజీవితంలో ప్లాస్టిక్ అవసరాలు పెరగడంతో పాటు ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా అధికమయ్యాయని, ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన, వస్తువుల తయారీపై 'సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' (సీపెట్)లో ఎంతోమంది యువత శిక్షణ పొందుతున్నారని డా??బి.శ్రీనివాసులు, సీపెట్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఉ హెడ్ ఈ రోజు హైదరాబాద్ చర్లపల్లిలోని సీపెట్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు .

కోర్సుల్లో శిక్షణ పొందుతున్నప్పుడే విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు వస్తున్నాయని, ప్లాస్టిక్ రంగ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నసీపెట్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని వివిధ విభాగాల్లో మానవ వనరుల అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే దిశగా కృషి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు డా॥బి.శ్రీనివాసులు తెలిపారు.

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా సీపెట్ ఆధ్వర్యంలో 300 మంది పేద, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ , భూపాలపల్లి , ఖమ్మం జిల్లాలను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ దత్తత తీసుకుంది. ఆ జిల్లాలకు చెందిన అభ్యర్థులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు డా. బి. శ్రీనివాసులు తెలిపారు. సీఎన్సీ మిల్లింగ్ ఆపరేటర్, ప్రోగ్రామర్, సీఎన్సీ లేత్ మిషన్ ఆపరేటర్, ప్రోగ్రామర్, టూల్ రూం మెషిన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజక్షన్, బ్లో మౌల్డింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. 8వ తరగతి, 10 వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా పూర్తిచేసుకున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి మినహాయింపు ఉంటుందని డా. బి. శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్‌తోపాటు 4 ఫొటోలతో నింపిన దరఖాస్తును hyderabad@cipet.gov కి మెయిల్ చేయాలని, లేదా ప్రత్యక్షంగా వచ్చి సంప్రదించాలని సూచించారు.

సీపెట్... పేద, వెనుకబడినవర్గాల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు కల్పిస్తోంది. ప్లాస్టిక్ రంగంలో దేశ, విదేశాల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని శ్రీ ఎ. కె . రావు , చీఫ్ మేనేజర్ (టెక్నికల్) తెలిపారు. హైదరాబాద్‌లోని సీపెట్ పదవతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్థులకు ప్లాస్టిక్ ఇంజనీరింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది. సీపెట్ సెంటర్లు దేశమంతటా 37 ప్రధాన నగరాలలో ఉన్నాయి. ప్లాస్టిక్స్ లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ప్రొఫెషనల్ కోర్సులు అందివ్వడం దీని ప్రత్యేకత.యువతకు ఉద్యోగావకాశాలు వెంటనే కల్పించడంతో పాటు వారు ఎంట్రీప్రెన్యూర్లుగా ఎదిగే సేవలను కూడా అందిస్తోంది. క్వాలిటీ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్లాస్టిక్ ఇండస్ట్రీస్‌కు డిజైన్, టూలింగ్, ప్లాస్టిక్ ప్రోసెసింగ్, టెస్టింగ్, క్వాలిటీ అస్యూరెన్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన తోడ్పాటును, శిక్షణను అందిస్తోంది. ఉపాధి పరంగా చూస్తే ప్లాస్టిక్ పరిశ్రమలు యువత భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నాయి. స్టైఫండ్ ఇస్తున్నారు. భవిష్యత్తులో శిక్షణ పొందిన యువత సొంత బిజినెస్ పెట్టుకోవడానికి కూడా అవకాశాలు బాగా ఉన్నాయి.స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాముల కింద పేద, నిరుద్యోగ యువతకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచితంగా శిక్షణ అందిస్తారు. మూడు నెలలు శిక్షణ ఉంటుంది.ఆధార్ కార్డు, కులం సర్టిఫికేట్, ఆదాయం సర్టిఫికేట్ తెచ్చి సీపెట్లో ఉచిత శిక్షణ పొందవచ్చు.డిప్లొమా చేయాలంటే పదవ తరగతి అర్హత (పాస్ లేదా ఫెయిల్) ఉంటే చాలు. ఎనిమిదవ తరగతి వరకూ చదివిన వారికి కూడా కొన్ని రకాల శిక్షణను అందిస్తారు. స్కిల్ డెవలెప్మెంట్ ప్రోగ్రాములలో గ్రామీణ యువతకు పెద్దపీట వేశారు. వీటికి దరఖాస్తు చేసుకోవాలనుకున్న వారు నేరుగా సీపెట్‌ను సంప్రదించవచ్చు.

ఈశాన్య ప్రాంతంలో హైడ్రోజన్ మొబిలిటి పరిష్కారాలను ప్రోత్సహించేందుకు హైడ్రోజన్ ఇంధన సంబంధిత స్టార్టప్ లతో ఇంక్యుబేషన్ ఒప్పందంపై సంతకాలు చేసిన ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఒఐఎల్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఒఐఎల్) నిన్న ఒమ్ క్లీన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ తో కలిసి ఇంక్యుబేషన్ ఒప్పందంపై సంతకం చేసింది. 9-ఎం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఆధారిత ఈ బస్ డిజైన్, ఇంటిగ్రేషన్ , డవలప్‌మెంట్,ధ్రువరూప ఆర్గానిక్ హైడ్రోజన్ కారియర్ (ఎల్.ఒ.హెచ్.సి) సొల్యూషన్ కు సంబంధించి ఒప్పందం కుదిరింది. ఈ స్టార్టప్‌కు ప్రతిష్ఠాత్మక ఐఐటి గౌహతి మెంటార్‌గా వ్యవహరించి దీనిని ముందుకు తీసుకుపోతుంది.

ఆయిల్ ఇండియా లిమిటెడ్ సిఎండి, శ్రీ సుశీల్ సిహెచ్. మిశ్ర, మాట్లాడుతూ, ఒఐఎల్ పరిశుభ్ర ఇంధన రంగంలో వినూత్న , మున్నెన్నడూ లేని సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. ఒఐఎల్ ఇప్పటికే హైడ్రోజన్ ఉత్పత్తి, బ్లెండింగ్ కు సంబంధించిన పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. ఇది ప్రస్తుతం ఈ స్టార్టప్ వెంచర్‌ను హైడ్రోజన్ స్టోరేజ్, రవాణా, మొబిలిటీ సొల్యూషన్స్‌కు సంబంధించి స్పాన్సర్ చేస్తోంది.ఇది భారతప్రభుత్వం చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్‌కు సహాయపడగలదని ఆయన అన్నారు. అలాగే ఇది ఈశాన్య ప్రాంతంలో హైడ్రోజన్ ఆర్థిక వ్యవస్థకు ద్వారాలు తెరుస్తుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఫైనాన్స్ డైరక్టర్ శ్రీహరీష్ మాధవ్,ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఎస్.ఎన్.ఇ.హెచ్ (స్టార్ట్ అప్ నర్చరింగ్,ఎనేబ్లింగ్ హాండ్లింగ్) స్నేహ్ పథకం కింద అర్హత గలిగిన స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఒఐఎల్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా గల ఆరు స్టార్టప్‌లకు మద్దతునిస్తున్నట్టు చెప్పారు. రోబోటిక్స్, ఇన్ స్ట్రుమెంటేషన్, బయోటెక్, ఇంధన సరఫరా సొల్యూషన్లు వంటి వాటికి సంబంధించి మద్దతునిస్తున్నట్టు తెలిపారు.

హైడ్రోజన్ ఇంధన రంగంలో ఈ రెండు కొత్త కొలాబరేషన్లను విజయవంతంగా పూర్తి చేయడంతో, ఆయిల్ ఇండియా లిమిటెడ్, స్టార్టప్ లతోకలిసి తక్కువ సమయంలో ఈశాన్య భారతదేశంలో హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఆధారిత ఇ-బస్‌ను నడపడంలో విజయవంతం కాగలదని ఆయన అన్నారు.

ఒహెచ్ ఎం క్లీన్ టెక్ డైరక్టర్ భావనా ఎస్.మయూర్ మాట్లాడుతూ, పరిశుభ్ర ఇంధన రంగంలో ఈశాన్య ప్రాంతంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. హైడ్రోజన్ ఆధారిత సాంకేతికత అయిన ఎల్.ఒ.హెచ్.సి, హైడ్రోజన్ బస్ ను మార్కెట్‌కు తీసుకురావడానికి అరుదైన అవకాశం దక్కుతోందని అన్నారు. ఒఐఎల్ తమ పై ఉంచిన విశ్వాసంతో తాము దేశానికి ఆత్మనిర్భర్ అభివృద్ధిని సాధిస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై టీఆర్ఎస్ శ్రేణుల

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో పార్టీ ప్రెసిడెంట్ మంత్రి వర్యులు కేటీఆర్× గారి ఆదేశాల శాసన సభ్యులు రమేష్ బాబు సూచనలతో కేంద్ర మొండి వైఖరికి నిరసనగా తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా, కేంద్ర ప్రభుత్వం వేసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేస్తూ రైతుల నిరసన ధర్నా పలు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలో పండిన పంట ఏసంగి వరి ధాన్యం కొనుగోలు విషయంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పట్టణంలో తెలంగాణ ఛౌక్ నుండి అమరవీరుల స్తూపం వరకు నల్ల జెండాలతో బైక్ ర్యాలి నిర్వహించి అనంతరం కేంద్ర దిష్టిబోమ్మ దహనం చెయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్× నాయకత్వం లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అభివృద్ధి లో ముందు వరుసలో నిలువుగా ,తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రజలకు దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంట్, రైతులకు సకాలంలో ఎరువులు అందించడం,అంతేకాకుండా పెట్టు బడి సాయం క్రింద నేరుగా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయడం.

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం లో జరుగుతున్న అభివృద్ధి,కొత్త గా ఏర్పడ్డా నాటి నుండి నేటికి ఎన్నో కష్టాలు పడ్డ రాష్ట్రంలో అసాధ్యం అని అనుకున్న కాళేశ్వరం ప్రాజెక్టును పనిని సుసాధ్యం చేసి చూపిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీ ఆర్ నాయకత్వం లో అభివృద్ధి ఓర్వలేక,కేసీఆర్ కి జాతీయస్థాయిలో వారి ప్రభావం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జీర్ణించుకోలేని కేంద్రం రైతులు పండించిన వరి పంటను కేంద్ర ప్రభుత్వం బిజెపి కొనుగోలు చేయకుండా రైతులను మభ్య పెట్టే మాటలు చెబుతోందని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి ప్రజలు రైతులు సరైన సమాధానం చెబుతారని.

శాసన సభ్యులు రమేష్ బాబు నాయకత్వంలో ఇప్పటికె నియె?జిక వర్గంలో 55 వెల ఏకారలకు గోదావరి జలాలను అందించడం జరిగింది.ఇంకా నైనా మీ మొండి వైఖరి మార్చుకొని రైతులు పండించిన వరి పంట ను కొనుగోలు చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు ,మాజి సెస్ డాక్టర్లు రామా తీర్థపు రాజు ,జడల శ్రీనివాస్ కౌన్సిలర్లు జెమిని శ్రీనివాస్ ,మారం కుమార్ ,సిరిగిరి చందు ,విజయ్ ,బింగి మాహేష్ ,కోష్టన్ సభ్యులు బాబున్ ,మల్లేశం మార్కట్ కమిటి సభ్యులు ఫీర్ మాహ్మద్ ,కమాలకర్ రెడ్డీ నాయకులు కోండ నర్సయ్య ,సలీం ,కమ్మరి శ్రీనివాస్ ,పోలాస నరేందర్ ,బాస్కరావు ,వెంగల శ్రీకాంత్ గౌడ్ ,వెంకటేశ్వరావు ,సత్తిరెడ్డీ ,వెంకట్ రెడ్డి ,టైలర్ శ్రీనివాస్ ,మరియు వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు యువజన నాయకులు రాము మరియు కార్యకర్తలు రైతు సంఘ నేతలు పలువురు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులపై దృష్టిసారించాలి

-ఆలయ ఈవోకు కాంగ్రెస్ నాయకుల వినతి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ ఈవో రమాదేవికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ ఆలయానికి వచ్చుజె భక్తులకు క్యూలైన్లలో సరైన వసతులు లేక అనేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్యూలైన్లలో మూడు నాలుగు గంటలు వేచి ఉన్న భక్తులకు మరుగుదొడ్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. క్యూలైన్లలో ఉండే భక్తులకు త్రాగు నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ధర్మగుండం పరిశుభ్రంగా ఉంచాలని, 25 రూపాయల భోజనశాలను రీ ఓపెన్ చేయాలని అన్నారు. గోశాలలో ఆవులకు సరైన ఆహారం లేక చనిపోవడం జరుగుతుందని, వేసవి కాలం సందర్భంగా ఆవులకు కూలర్లను ఏర్పాటు చేయాలన్నారు. కోడెల ఆహారానికి నిత్యం పచ్చి గడ్డి అందుబాటులో ఉంచాలన్నారు. అనారోగ్యం బారినపడుతున్న కోడెలకు వెంటనే వైద్యం అందించేలా నిత్యం అందుబాటులో ఉండే వెటర్నరీ డాక్టర్ ను నియమించాలని కోరారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రాజన్న ఆలయం దారి తెలియక చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రధాన కూడళ్ల సైన్ బోర్డులను పర్మినెంట్ గా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రమేష్, పాత సత్య లక్ష్మి, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేష్, తంగెళ్ల గణేష్, నాగుల రాము గౌడ్, దాడి మల్లేశం, కూర దేవయ్య, మె0డే రాజు, తదితరులు ఉన్నారు.

ఏపీలో 57 మంది జిల్లా, అదనపు జిల్లా జడ్జీల బదిలీలు

అమరావతి, ఏప్రిల్ 8:ఆంధ్రప్రదేశ్‌లో 57 మంది జిల్లా, అదనపు జిల్లా జడ్జీలను బదిలీలు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది . తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వెంకట జ్యోతిర్మయి, కడప జిల్లా న్యాయమూర్తిగా ఎన్. సలోమన్ రాజు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి . పురుషోత్తం కుమార్, చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇ. భీమారావు, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వైవిఎస్ పార్థసారథిలను నియమించింది.

అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బి. శ్రీనివాస్, కృష్ణ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక , ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎ. భారతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా అదనపు జిల్లా జడ్జీలను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది .

సినీ హీరో అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో సినీ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ టౌన్ ప్రెసిడెంట్ శీలం విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగాఫ్యామిలీ నియోజకవర్గ ఇంచార్జి మారం ప్రవీణ్ పప్పీ , రాష్ట్ర నాయకులు అరుణ్ తేజ చారి, సుంకరి అంజిబాబు వడ్లకొండ సంతోష్, కర్రు తిరుపతి, చరణ్ ,విక్రం,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి వినూత్న నిరసన

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8:(నేటినిజం ప్రతినిధి):తెలంగాణలో పండిన వడ్లను కొనని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి తెరాస నేత వినూత్నంగా నిరసన తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ పల్లి లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి తన ఇంటిపై శుక్రవారం నల్ల జెండా ఎగురవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెరాస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే రమేష్ బాబు పిలుపుమే